క్లుప్తంగా

స్టీల్ బ్రిడ్జిని పూర్తి నాణ్యతతో నిర్మించాలి

చిక్కడపల్లి: స్టీల్ బ్రిడ్జిని నాణ్యతాలోపంతో నిర్మిస్తే అడ్డుకుంటామని టీజేఎస్ జనసమితి ముషీరాబాద్ కన్వీనర్ శ్రీనివాస్‌యాదవ్, గాంధీనగర్ డివిజన్ కన్వీనర్ రవిందర్‌యాదవ్‌లు అన్నారు. శనివారం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మూడు నెలల్లో బ్రిడ్జిని నిర్మించాలని శనివారం ఆకస్మిక తనిఖీలో మంత్రి కేటీఆర్ ఆదేశించడం సరికాదన్నారు. ఎన్నికలు వస్తున్నాయనే ఇలాంటి ఆదేశాలు ఇచ్చారని త్వరగా నిర్మించాలనే కారణంతో అధికారులు ఒత్తిడికి గురై నాణ్యత లేకుండా బ్రిడ్జిని నిర్మించే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్తి నాణ్యతతో బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేశారు.

అలరించిన సినీసంగీత విభావరి



చిక్కడపల్లి: నవ హృదయరాగం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. ఈ సందర్భంగా శనివారం త్యాగరాయగానసభలో సంస్థ ప్రథమ వార్షికోత్సవం వేడుక ఘనంగా జరిగింది. గ్రేటర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరసయ్యను వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజ సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. కళా కార్యక్రమాలు విరివిగా జరగాలని ఆకాంక్షించారు. లిటిల్ మ్యుజీషియన్స్ అకాడమీ అధినేత రామచారి, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ మంటలు.. కొనసాగుతున్న నిరసనలు



తిలక్‌నగర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత రోహిత్ ఆధ్వర్యంలో..

అంబర్‌పేట: గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలను కేంద్ర ప్రభుత్వం దోపిడీ చేస్తోందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీఎస్ బోస్ మండిపడ్డారు. ప్రజల సొమ్మును కొల్లగొట్టి కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతుందని ఆరోపించారు. పెరిగిన గ్యాస్ ధరలకు నిరసనగా ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం 6 నెంబర్ చౌరస్తాలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ హయంలో చౌకగా ఉన్న ఇంధన ధరలు ఖరీదుగా మారాయన్నారు. తక్కువ ఆదాయం కలిగిన ప్రజలు పెరిగిన గ్యాస్ ధరలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. పెంచిన వంటగ్యాస్ ధరలను కేంద్రప్రభుత్వం తక్షణమే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం, నగర ప్రధాన కార్యదర్శి మల్లేష్, నాయకులు ఒమర్‌ఖాన్, కృష్ణమూర్తి, రవీందర్‌రెడ్డి, భూపాల్‌గౌడ్, రాజు, లతీఫ్ తదితరులున్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో...

- తిలక్‌నగర్ చౌరస్తాలో పెరిగిన గ్యాస్ ధరలను నిరసిస్తూ సీపీఎం నాయకులు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. గ్యాస్ సిలిండర్, కట్టెలు, ప్లకార్డులతో ప్రదర్శన చేస్తూ.. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు ఎం.మహేందర్, నాయకులు రాములు, సుబ్బారావు, సోమయ్య, డీఎల్.మోహన్, వరలక్ష్మి, నాగమ్మ, పర్వతాలు, మంగమ్మ తదితరులున్నారు.

అమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో..

కవాడిగూడ: కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా గ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని తెలంగాణ ఆమ్‌ఆద్మీ పార్టీ కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాముగౌడ్ ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా 13 సార్లు గ్యాస్ ధరలను పెంచిందని సామాన్యులు గ్యాస్‌పై వంట చేసుకుని మూడు పూటలు తినలేని దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా శనివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలంగాణ ఆమ్ ఆద్మీ పార్టీ కోర్ కమిటీ ఆధ్వర్యంలో వినూత్నంగా నిరసన చేశారు. ఈ సందర్భంగా రాముగౌడ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తుంటే అదే పార్టీకి రాష్ట్ర నేతలు ప్రజలను మోసం చేసేందుకు ప్రకటనలు చేయడం హాస్యాస్పదమన్నారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని లేని పక్షంలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పార్టీ నేతలు సయ్యద్ గఫార్, కరీంనగర్ ఇన్‌చార్జ్ రణధీర్‌సింగ్ రాణా, సూర్యపేట పార్లమెంటరీ ఇన్‌చార్జ్ అఫ్జల్, సలావుద్దీన్, రమేష్, మాజిద్, అప్సా తదితరులు పాల్గొన్నారు.



ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద..

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

నల్లకుంట: పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోతరోహిత్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్యాస్ సిలిండర్ ధరల పెంపును నిరసిస్తూ.. రోహిత్ ఆధ్వర్యంలో శనివారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన సమయంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.410.50 ఉండగా మోదీ పాలనలో మూడింతలు పెరిగి రూ. 1155కి చేరిందన్నారు. ఈ ర్యాలీలో యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'అటవీ హక్కులపై అప్రకటిత యుద్ధం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య రచించిన అటవీ హక్కులపై అప్రకటిత యుద్ధం పుస్తకాన్ని విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆదివాసీ నాయకులు గుండాల మండల ఎంపీపీ సత్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత మాట్లాడుతూ.. 2006 అటవీ హక్కుల చట్టం వచ్చి 17 ఏళ్లు అవుతున్న ఇంత వరకు పూర్తి స్థాయిలో దేశవ్యాప్తంగా ఈ చట్టం అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ఉద్యమాల ఫలితంగా ఆదివాసీలకు కొన్ని హక్కులు కల్పించబడ్డాయని దానిలో 1/70, 'పెసా' లాంటి చట్టాలను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి దానిని ఆమోదించి చట్టంగా తీసుకురాలేకపోయిందన్నారు.

- ఈ చట్టం ద్వారా దేశవ్యాప్తంగా అడవిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న దాదాపు 40 కోట్ల మంది ప్రజలకు, వారిలో 10 కోట్ల మంది ఆదివాసీ గిరిజనులకు అండగా ఉంటుందన్నారు.
- పోరాడి సాధించుకున్న హక్కులు అటవీ సంరక్షణ నియమాలు 2022 ద్వారా అమలులోకి రాకుండా నిర్వీర్యం అవుతాయన్నారు. రాష్ట్రంలో పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలు ఇస్తామని అనేక సార్లు ప్రకటించిన సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించారన్నారు.
- 11 లక్షల ఎకరాలకు హక్కులు కల్పిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి గిరిజనేతులకు ఇచ్చేది లేదని తేల్చిచెప్పారన్నారు. పోడు సాగుదారులంతా ఆక్రమణదారులని, చట్టాలను అతిక్రమిస్తే శిక్షిస్తామని హెచ్చరించడం సరికాదన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి వెంకన్న, సహ కార్యదర్శి డేవిడ్‌కుమార్, జే.రాజు, కోశాధికారి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య సిబ్బందితో ఇన్‌స్పెక్టర్ అశోక్

అంబర్‌పేట: శాంతిభద్రతలు, ప్రజా సమస్యలపై పని ఒత్తిడికి గురయ్యే పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు తమవంతు చేయూతనందిస్తామని సీజన్స్ ఆసుపత్రి వైద్యులు, ఆమ్‌ఆద్మీ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా.హరిచరన్ తెలిపారు. శనివారం అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో అధికారులు, సిబ్బందికి పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటారని వారికి ఆరోగ్యపరంగా తమవంతు సాయం చేస్తామన్నారు. డాక్టర్ హరిచరణ్‌కు ఇన్‌స్పెక్టర్ అశోక్ ధన్యవాదాలు తెలిపారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ అంజయ్యనగర్‌లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సహకారంతో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 15 సీసీ కెమెరాలను నల్లకుంట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల నేరాల నియంత్రణకు నేరస్తులను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. నియోజకవర్గంలో ప్రతి బస్తీ, కాలనీలో అపార్ట్‌మెంట్లు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్బు, ప్రధాన కార్యదర్శి గులామ్‌అహ్మద్, బస్తీ వాసులు షేక్ జాఫర్, రఫత్‌అలీ, ఫిరోజ్, ఉస్మాన్, సయ్యద్ షరీఫ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మనోహర్‌సింగ్, డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



అంబర్‌పేట: సేవా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని శైలజ ప్రారంభించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శంకర్, రాజేష్, సంతోష్, దామోదర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'నాదోపాసనతో భగవంతున్ని తెలుసుకోవచ్చు'



నల్లకుంట: నాదోపాసనతో భగవంతున్ని తెలుసుకోవచ్చని నిరూపించిన గొప్ప వాగ్గేయకారుడు త్యాగరాజ స్వామి అని శ్రీరామ గాన సభ కార్యదర్శి కొణికి సాయి శ్రీనివాసశర్మ అన్నారు. గాన సభ ఆధ్వర్యంలో న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు శనివారం సాయంత్రం పలువురు సంగీత విద్వాంసులు ఆలపించిన కీర్తనలతో ఆలయ ప్రాంగణం పులకించి పోయింది.

ఆరాధనోత్సవాల ముగింపు..

- త్యాగరాజ స్వామి వార్షిక ఆరాధన సంగీత మహోత్సవాలు ఈరోజుతో ముగుస్తాయని శ్రీ రామ గాన సభ కార్యదర్శి సాయి శ్రీనివాస శర్మ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నాగరాజన్ భాగవతార్‌చే ఉంఛవృత్తి, అనంతరం గోష్ఠిగానం ఉంటుందన్నారు. సాయంత్రం 6.45 గంటలకు భరతనాట్య ప్రదర్శన ఉంటుందన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి



సెయింట్ ఆడమ్స్ వార్షికోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు


సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను పెంపొందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెయింట్ ఆడమ్స్ హైస్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తూ.. దేశం గర్వపడేలా ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి మాట్లాడుతూ.. ప్రణాళికా బద్ధంగా విద్యను అభ్యసిస్తూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్, డైరెక్టర్ డా. శ్రావణ్‌కుమార్, తెలంగాణ ప్రైవేటు జూనియర్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరీసతీష్, ఉపాధ్యాయులు తదితరులున్నారు. ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట



కవాడిగూడ: మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని రాష్ట్ర మైనార్టీ కమీషన్ చైర్మన్ తారిక్ అన్సారీ అన్నారు. శనివారం భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ మైనార్టీ కమిటీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రహీం ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మైనార్టీలు విద్య, ఉద్యోగ రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. మహ్మద్ నసీర్, గౌస్‌ఖాన్, ముస్తాక్ అహ్మద్, ఫిరోజ్ తదితరులున్నారు.

'కాంగ్రెస్ పాలన కోసం ప్రజల ఎదురు చూపు'



కవాడిగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ప్రజలు విరక్తి చెంది కాంగ్రెస్ పాలన కోసం ఎదురు చూస్తున్నారని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. శనివారం కవాడిగూడ డివిజన్‌లోని తాళ్లబస్తీ, ఉన్నికోట, చిత్రాలనగర్ బస్తీలలో 'హాత్ సే హాత్ జోడో యాత్ర' లో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోడో యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్, ముషీరాబాద్ ఎ-బ్లాక్ అధ్యక్షులు వీ.డీ.కృష్ణ, రాష్ట్ర నాయకులు యాదగిరి, లక్ష్మణ్, డివిజన్ అధ్యక్షులు ధర్మేందర్, మాజీ అధ్యక్షులు సాయిబాబా, నాయకులు రమేష్‌యాదవ్, భాస్కర్, రాము, మధు, బాబురావు, రుషికేశ్వర్ తదితరులున్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నేతలు



ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో ఇందిరాపార్కు నుంచి వీఎస్‌టీ వరకు నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి పనులను ఆకస్మికంగా తనిఖీ చేయడానికి వచ్చిన మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను అడిక్‌మెట్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణలు కలిశారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని వారికి మంత్రి సూచించినట్లు సమాచారం.

ఐజాక్‌రాజ్‌కు సన్మానం



సన్మానిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్

నల్లకుంట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో నిర్వహించిన జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న పలువురిని సన్మానించారు. నల్లకుంటకు చెందిన మిషన్ మోదీ రాష్ట్రీయ ప్రధాన కార్యదర్శి ఐజాక్‌రాజ్‌కు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు జ్ఞాపికను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్లోబల్ రైట్స్ చైర్మన్ డా.మిరియంబాబు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికులు కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. స్థానికులు చంద్రశేఖర్, బీజేపీ నాయకులు ఎ.వినయ్‌కుమార్, శ్రీకాంత్, నవీన్, శ్రీనివాస్, మహమూద్, చందు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు జ్యోతి

కాచిగూడ: హేల్ టాటా మణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ సంస్థ ప్రతినిధులు శ్రీ వాత్సల్యవల్లి ఫౌండేషన్ చంపాపేట్ వృద్ధాశ్రమంలో నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ.. వృద్ధులు, పేదలు, అనాథలకు సేవ లందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించి వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫౌండేషన్‌ను స్థాపించి దాని ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. మిరియంబాబు, ప్రేమలత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కర్ణాటక సాహిత్య మందిర్ ప్రతినిధులు సురేంద్ర కట్‌గేర్, నర్సింహ్మామూర్తి తదితరులు

కాచిగూడ: కర్ణాటక సాహిత్య మందిర్ పునర్నిర్మాణం కోసం సీఎం కేసీఆర్ రూ.5 కోట్ల నిధులు మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేయడం పట్ల కన్నడిగులు హర్షం వ్యక్తం చేశారు. కాచిగూడలోని కర్ణాటక సాహిత్య మందిర్‌లో శనివారం సాహిత్య మందిర్ అధ్యక్షుడు సురేందర్ కట్‌గరే, కార్యదర్శి నర్సింహ్మామూర్తి ఆధ్వర్యంలో కన్నడ ప్రజలు సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. హైదరాబాద్‌లో స్థిరనివాసం ఏర్పరుచుకుని దశాబ్దాలుగా జీవనం సాగిస్తున్న కన్నడ ప్రజల కోసం సాహిత్య వేదికను నిర్మించేందుకు సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ రాంబాబు, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు భీష్మదేవ్, శిరీష, ఓంప్రకాష్ యాదవ్, సదానంద్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, శేషు, విజితారెడ్డి, మన్నె శ్రీనివాస్‌యాదవ్, కృష్ణాగౌడ్, రాకేష్, శ్రీకాంత్, సాహిత్య మందిర్ నేతలు బల్లాల్, రాఘవేందర్ దేశాయ్, నర్సింహ్మామూర్తి, పరిమళ్‌రావు, ముకుంద్ కులకర్ణి, సురేందర్ కులకర్ణి, మురళీధర్ పూజార్, కీర్తిసాగర్ మాన్వికర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో రాజ్యాధికారం వైపు పయనించాలి



నియామకపత్రాన్ని అందజేస్తున్న పోతరాజు లాలయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో దళిత బహుజనులు రాజ్యాధికారం వైపు పయనించాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతరాజు లాలయ్య పిలుపు నిచ్చారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ అంబేడ్కర్ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. దేశంలో రోజురోజుకు దళితులు, మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత బహుజనులకు అండగా అంబేడ్కరిస్టులు ఉండాలని పిలుపునిచ్చారు. డాక్టర్ పసునూరి రవీందర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రవీందర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్, ఉపాధ్యక్షులు దయాకర్, ఉపాధ్యక్షులు జయ, రాష్ట్ర అధికార ప్రతినిధి సదానందం పాల్గొన్నారు.

- అంబేడ్కర్ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా గణపురం రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఏదుల బస్వరాజులను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతరాజు లాలయ్య నియామకపత్రాన్ని అందజేశారు.

అనాథలకు జారీచేసిన జీవోలను అమలు చేయాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: అనాథల హక్కుల కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవోలు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర అనాథ హక్కుల పరిరక్షణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బొక్క వెంకటయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న అనాథల ఆస్తులు, వంశ పారపర్యంగా వచ్చిన భూములకు రక్షణ కల్పించాలని ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కలెక్టర్లు, సీసీఎల్‌ఏ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జారీచేసిన ఆదేశాలను సమర్థవంతంగా అమలు జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జీఓ 47 ద్వారా ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలల్లో 3 శాతం రిజర్వేషన్లు కల్పించి సీట్లు ఇప్పిస్తూ.. అవి సరిపోకపోతే సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ రోనాల్డ్ రోస్‌కి ప్రత్యేకంగా లేఖ రాసి సీట్లు ఇప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జీవో.124 ప్రకారం ప్రతి అనాథకు మీసేవ ద్వారా ఆదాయ ధృవీకరణ పత్రాలు ఇప్పిస్తున్నామన్నారు. జీవో 28 మీసేవ ద్వారా అనాథ ఐడీకార్డులు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనాథ బాలబాలికల పట్ల లైంగిక వేధింపులు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. జీవోల అమలుపై తహసీల్దార్లు, ఆర్డీఓలు నిర్లక్ష్యంగా వ్యవహరించినా అనాథలను ఇబ్బందులకు గురిచేసినా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి..

కాచిగూడ: డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అధికారులకు సూచించారు. శనివారం కాచిగూడ జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో రివ్యూ మీటింగ్ నిర్వహించి తగిన సూచనలు, సలహాలు చేశారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, ప్యాచ్‌వర్క్ పనులను వెంటనే చేపట్టాలని ప్రస్తుత జనాభా అవసరాలకు అనుగుణంగా నూతనంగా డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులను చేపట్టాలన్నారు. ఐమాక్స్ స్ట్రీట్‌లైట్లు, అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. రోడ్లపై ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని సూచించారు. బస్తీలు, రోడ్లపై కుక్కలబెడద నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈఈ రాజు, డీజీఎం సన్యాసిరావు, ఏఎంహెచ్‌ఓ జ్యోతి బాయి, డీఈ వెంకటరామరెడ్డి, ఏఈ భావన, వెంకటేష్‌యాదవ్, ఏఈ దివ్య, యూఎంఎస్ నరేందర్ రెడ్డి, వెంకటయ్య, బీజేపీనేతలు కన్నె రమేష్‌యాదవ్, రాము, నరేష్, సంతోష్, సుభాష్‌పటేల్, మల్లికార్జున్, బల్వీర్, భీమ్‌రాజ్, దినేష్‌బాబు తదితరులున్నారు.